## విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు..

కాచిగూడ,ఏప్రిల్ 30 : పదోతరగతి పరీక్షల ఫలితాలు వచ్చిన నేపథ్యంలో విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, సబ్జెక్టులలో తక్కువ మార్కు లు వచ్చాయనో, ఫెయిల్ అయ్యాననో ఆత్మన్యూన్యతాభావానికి లోనుకావద్దని ప్రేరణ బాలల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అకెనపల్లి లక్ష్మణచారి అన్నారు. ఫెయిల్ అయిన సబ్జెక్టులలో మళ్లీ అడ్వాన్స్ పరీక్షలు రాసి పాస్ కావచ్చని, విద్యాసంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన జీవితంలో ఫెయిల్ అయినట్లు కాదని, కష్టపడి రాణించాలని సూచించారు.




## బసవేశ్వరుడి సేవలు చిరస్మరణీయం



తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 30: 12వ శతాబ్దంలోనే సమాజానికి స్ఫూర్తిని కలిగించిన మహాత్మ బసవేశ్వర జయంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో తెలంగాణ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగనాథ్‌రాజేశ్, శివ కుమార్ మాశెట్టిల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ధర్మేంద్ర పూజారి, జ్యోతి, విద్య, శ్రీనివాస్ పండరి తదితరులు పాల్గొని బసవేశ్వరుడు చిత్ర పటానికి పుష్పాంజలి సమర్పించి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

## కులగణనపై కేంద్ర నిర్ణయం హర్షణీయం

రవీంద్రభారతి,ఏప్రిల్ 30: కులగణన దేశ వ్యాప్తంగా చేపట్టాలని కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని ప్రకటించడం హర్షణీమని జాతీయ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ అన్నారు. ఫోరం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీల మద్దతు కూడగట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 42శాతం బీసీ బిల్లును ఆమోదిస్తూ తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని, 22 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన బీసీ ఆజాది జేఏసీ చైర్మన్, హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ పటేల్ దీక్ష ఫలించిందన్నారు.నేడు కేంద్ర ప్రభుత్వం కులగణన చేపడతామని ప్రకటన చేయడం గొప్ప పరిణామం అన్నారు. ఆమరణ దీక్షకు నేతృత్వం వహించిన ఆళ్ల రామకృష్ణ, హిందూ బీసీ మహాసభ కార్యవర్గానికి, బీసీ ఆజాది ఫెడరేషన్, రాష్ట్ర అంబేద్కర్ ఆజాది సంఘం, బీసీ సంక్షేమ సంఘం, రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల నాయకులు బత్తుల సిద్దేశ్వర్ పటేల్‌కు సంఘీభావం తెలిపినందుకు ప్రధాని మోదీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## 'డబుల్' ఇండ్ల లబ్ధిదారులకు నోటీసులు

- ఇండ్లల్లో సదుపాయాలు కరువు.. ఎలా ఉండాలని బాధితుల ఆవేదన


లబ్ధిదారులకు నోటీసులు అందిస్తున్న అంబర్‌పేట రెవెన్యూ అధికారులు

అంబర్‌పేట, ఏప్రిల్ 30 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. గత ప్రభుత్వం కేటాయించిన ఇండ్లలో నివాసముంటున్నారా? లేదా? అనే విషయమై ఈ నోటీసులను ఇస్తున్నారు. ఇచ్చిన నోటీసులకు ఏడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని లబ్ధిదారులకు సూచిస్తున్నారు. బుధవారం అంబర్‌పేట మండల పరిధిలో కొంతమందికి అధికారులు నోటీసులను జారీ చేశారు. అంబర్‌పేట మండల పరిధిలో నివాసముంటున్న వారిలో చాలామందికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వచ్చాయి. రంగారెడ్డి జిల్లా పరిధిలో గల ప్రతాపసింగారం, రాంపల్లి తదితర ప్రాంతాల్లో అంబర్‌పేట మండల లబ్ధిదారులకు కేటాయించారు. అయితే వారికి కేటాయించిన ఇండ్లల్లో లబ్ధిదారులు నిజంగా నివాసముంటున్నారా? లేదా? అనే విషయమై ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతాపసింగారం, రాంపల్లికి వెళ్లి సర్వే చేశారు. సర్వే రిపోర్టును రెవెన్యూ అధికారులకు ఇచ్చారు. అందులో కొందరు అక్కడ నివాసముంటలేరని గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. అంబర్‌పేట మండలంలో మొత్తం 1726 మందికి నోటీసులు ఇస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నివాసముండటానికి కావాల్సిన సదుపాయాలు ప్రస్తుత ప్రభుత్వం కల్పించడం లేదని వారు వాపోయారు. సౌకర్యాలు లేకపోతే తాము ఆ గృహాల్లో ఎలా నివాసముండాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై అధికారులు నోటీసులు ఇవ్వడం సరికాదని మండిపడ్డారు.







## పది ఫలితాల్లో బాలికలదే పైచేయి


వి.విజిత-567 జ్యోత్స్నవి-565 యామిని-555

అంబర్‌పేట, ఏప్రిల్ 30 : విద్యాశాఖ హిమాయత్‌నగర్ జోన్ పరిధిలోని(అంబర్‌పేట, హిమాయత్‌నగర్ మండలాలు) ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 89.58శాతం ఉత్తీర్ణత నమోదైంది. బుధవారం ప్రకటించిన పదోతరగతి ఫలితాల్లో బాలికలే అధికంగా మార్కులు సాధించారు. జోన్ పరిధిలో మొత్తం 11 ఉన్నత పాఠశాలలు ఉండగా, అందులో మూడింటిలో వంద శాతం ఉత్తీర్ణత, ఐదింటిలో 90శాతం పైగా ఉత్తీర్ణత, మిగతా మూడింటిలో 80 శాతంపైగా ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 528మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 473 మంది పాసయ్యారు. 55మంది ఫెయిల్ అయ్యారు. అంబర్‌పేటలోని పోలీస్ బాయ్స్ స్కూల్‌కు చెందిన వి. విజిత 567 మార్కులు సాధించి జోన్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఇదే స్కూల్‌కు చెందిన కె. జ్యోత్స్నవి 565 మార్కులుపొంది రెండో స్థానంలో నిలిచింది. హిమాయత్‌నగర్ పీఆర్ఆర్ పాఠశాలకు చెందిన సుక్క యామిని 555 మార్కులు సాధించింది. వివరాలను జోన్ డిప్యూటీ ఈవో ఆస్రా ఫాతిమా తెలియజేశారు.

## ఘనంగా హోమియో ఫెస్ట్

రవీంద్రభారతి : శామ్యూల్ హనిమన్ జయంతిని హోమియోపతిక్ మెడిక్‌ల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఒక్క రోజు హోమియో ఫెస్ట్ 2కే కార్యక్రమాన్ని ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆడిటోరియంలో నిర్వహించారు. కేఎన్‌ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డా.పివి నందకుమార్ రెడ్డి, సీబీఐ మాజీ ఉప సంచాలకులు లక్ష్మీనారాయణ హాజరై డా. హానిమన్, డా. ఎన్.రామయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు.




